# గుల్ బహార్

హైమవతిగురించి ఆలోచిస్తూ నడుస్తున్నాను. నా ఆలోచనల కనుగుణంగా కుడిచేతి చూపుడువేలు గాలిలో గీతలు గీస్తోంది. 'హలో' అన్న పలకరింపు వినపడగానే తలెత్తి చూసాను.

గణపతిరావు కనపడగానే విష్ చేసాను.

''ఎక్కడి కలా తలొంచుకుని ఆలోచిస్తూ నడిచేస్తున్నారు? ఎవరైనా అమ్మాయికి డాష్ ఇవ్వగలరు...'' అన్నాడు నవ్వుతూ.

''అమ్మాయికి డాష్ యిచ్చినా, అబ్బాయికి డాష్ ఇచ్చినా, గోడకు డాష్ ఇచ్చినా ఒకటే...ఎంచేతనంటే నే నిప్పుడు ఓ అమ్మాయి ఆలోచనలో ఉన్నాను కాబట్టి...ఎక్కడికని అడిగారు కదూ... నాకీ వారం ఫస్టునైటు డ్యూటీ. ఎక్చేంజికి పోతున్నా'' అన్నాను. "రండి—కాఫీ తాగిపోదాం. నేనూ అలా ఎక్చేంజి వరకూ వస్తా'' అన్నాడు గణపతిరావు.

''మీ కీ వారం సెకండ్‌నైట్ కాదూ...''

''అవుననుకోండి... ఇంటిదగ్గరుంటే ఏవీ తోచటంలేదు. పడుకుందామంటె మళ్ళాలేచేసరికి తెల్లారిపోతుంది. మరి జీరో అవర్స్ వరకూ ఎలాగో కాలక్షేపం చేస్తే డ్యూటీకి వెళ్ళొచ్చు కదా... రండి కాఫీ తాగుదాం...మీ మానేటరుతో చెప్తాలెండి ఆలస్యానికి కారణం..." అన్నాడు గణపతిరావు.

హోటలుకు చేరేసరికి గణపతిరావుకు మరో ఫ్రెండు తగిలాడు. ముగ్గురం ఒకమూల కూర్చున్నాం. గణపతిరావు వాళ్ళ ఫ్రెండూ మాటల్లోకి దిగేసరికి, నేను హైమవతి ఆలోచనల్లోకి దిగేను.

ఆవేళ......

ఎండ మాడ్చేస్తూ నడినెత్తిన ఉన్న సూర్యుణ్ణి రెండుబాణాల్తో సఫా చేసేద్దామా అన్నట్టుగా గడియారంలోని రెండు ముళ్ళూ మీదకి ఎక్కుపెట్టి ఉన్నాయి.

ఉదయం ఏడుగంటలనుండి నెత్తిమీద కిరీటం పెట్టుకొని రాజ్యం చేసానేమో ఆకలేసింది. నెత్తిమీద హెడ్‌గేర్ సెట్టుని కీబోర్డుమీద పారేసి భోజనానికి బయలుదేరేను.

చిన్నవీధిలోంచి వెళుతూంటే అప్రయత్నంగా ఓ ఇంట్లోకి దృష్టి మళ్ళింది. ఒక అపరంజి బొమ్మ ఒక రబ్బరు బొమ్మలాంటి పాప నెత్తుకునివుంది. నే చూసేసరికి ఆ పాప రెండు బుగ్గలమీదా ముదు పెట్టుకుంది. ఆ ముద్దులు నాకే పెట్టినట్టుగా అనిపించి నా పెదవులూ బుగ్గలూ అదిరాయి. నా ఆకలి సగం ఎగిరిపోయింది. ఆ అపరంజి బొమ్మే హైమవతి.

హైమవతి ఎంత బాగుంటుందో నే చెప్పలేను. చెప్పను. ఎందుకంటే ఆమె గురించి నే చెప్పగలిగింది ఎప్పుడూ తక్కువగానే ఉండొచ్చని నా అభిప్రాయం.

అప్పటినుండి వరసగా ఆవారం అంతా ఫస్టుషిఫ్టేగనక రోజూ ఆ మిడసరి లగ్నానికే హైమవతిని చూసేవాణ్ణి.

కాని ఈ వెధవ ఉద్యోగానికి ఒక తిన్నగా డ్యూటీ వుండదుగదా. ఒకసారి ఫస్టుషిఫ్టూ... మరోసారి సెకండుషిఫ్టూ... ఒకవారం ఫస్ట్‌నైట్...

మరొకవారం సెకండ్‌నైట్.... ఇలాగా అస్తవ్యస్తంగా డ్యూటీలుంటే నే నెలా హైమవతికి ఆ పన్నెండు గంటలకే అటండెన్స్ ఇచ్చేది. ఇలా టైములేకుండా ఆ చిన్నవీధిలోంచి వెళ్తే ఏ ప్రేయసి నా కోసం కాసుకు కూర్చుంటుంది ?

ఆ స్వీట్ కిసెస్ జ్ఞాపకంవచ్చి నవ్వుకుంటూ కాఫీ కప్పు అంచు చుట్టూ వేలితో రాస్తున్నాను.

"ఏమిటి! అమ్మాయిగారు మిమ్మల్ని వదలనంటున్నారా..." అని కనుబొమ్మలెగరేస్తూ గణపతిరావు అంటేగాని నే నీలోకంలోకి రాలేక పోయాను.

అతను పోల్చేసినందుకు సిగ్గుగా మునిముని నవ్వులు నవ్వాను. 'విష్ యూ గుడ్ లక్' అంటూ భుజం తట్టాడు గణపతిరావు. అతనెంత ఫ్రెండ్లీగా మాట్లాడినా అధికారి కాబట్టి నేను మనసు విప్పి మాట్లాడలేదు.

కాఫీ బిల్లు అతనే చెల్లించేసేడు. గణపతిరావు ఫ్రెండు బైచెప్పేసి వెళ్ళిపోయేడు. మేమిద్దరమూ ఎక్చేంజికి బయలుదేరేము.

సాయంకాలం అప్పుడే నాలుగున్నర కావస్తోంది. ఫస్టునైట్ డ్యూటీ నాలుగు గంటలకే.. గణపతిరావువల్లే ఆలస్యమైంది.

చిన్నవీధిలోకి మలుపుతిరిగేం...

హైమవతి, ఇంటిముందు రబ్బరు పాపను ఎత్తుకొనివుంది. ఆమె కనిపిస్తేచాలు కాఫీతాగినంత బలం వస్తుంది. ఉత్సాహంగా నడుస్తున్నాను.

హైమవతి చేతిలో గుల్‌బహార్ పువ్వుఉంది. నేను దూరం నుండి చూస్తూవుండగానే పువ్వును ముద్దుపెట్టుకుంది. మేం వాళ్ళింటిని

క్రాస్ చేస్తుండగా ఓ గుల్ బహార్ పువ్వు నా కాళ్ళముందర పడటం చూసాను. వెంట నే చివ్వున తలెత్తి హైమవతిని చూసాను.

నాలికకరచుకుంటూ లోనికి వెళ్ళిపోవటం... లోపల గుమ్మం దగ్గర నించుని నవ్వటం కనుపించింది నాకు. నా భుజం మీదుగా నా పక్కనే నడుస్తున్న గణపతిరావు మీదుగా హైమవతి ఇంట్లో చూసినప్పుడు నా కళ్ళ నాకర్షించింది మరొహటి.

గణపతిరావు హైమవతికేసి చూడడం...ప్రతిగా తలవంచుకొని చిరునవ్వులు నవ్వుకోవటం...

నా కళ్ళు పచ్చ బడ్డాయి.

కొంపదీసి గణపతిరావుకు్కాని హైమవతి తెలుసునేమిటి కాకపోతే హైమవతిని చూసి ఎందుకు నవ్వుతాడు. లేకపోతే నాకన్నా ముందే హైమవతితో ఫస్టులవ్‌లో పడ్డాడా?

ఎందుకు పడకూడదు? ఎక్చేంజికి పోవాలంటే చిన్నా వీధినుండే వెళ్ళాలి. నాకన్నా గణపతిరావు సర్వీసెక్కువే గదా. అంచేత తరచూ అటే వెళ్తున్నవారికి హైమవతి తెలియకపోవట మేమిటి? హైమవతి కూడా ఈ గణపతిరావును చూసి వుండదనుకోవటం తప్పే. గణపతి రావు మంచి స్ఫురద్రూపి. అతని కళ్ళు మనుషుల నిట్టే ఆకట్టు కుంటాయి. అలాంటి గణపతిరావుని చూసి హైమవతి నవ్వుతుందంటే ఆశ్చర్య మేం వుంది ?

కాని—కాని—నాకే అదోలావుంది. గణపతిరావుగాని నాకు ప్రతికక్షి కాడుగదా—

గణపతిరావుమీద నాకుండే అభిమానం అంతకన్నా ఎక్కువ ఆలోచించ నివ్విందికాదు.

మా మానేటర్‌తో గణపతిరావు చెప్పగానే— నేను వెళ్ళి మళ్ళా హెడ్‌గేర్ సెట్ తగిలించుకుని కీబోర్డు ముందు కూలబడ్డాను

హైమవతి ఆలోచన్లు సముద్రపుటలల్లాగా వస్తూనే ఉన్నాయ్. ఫోన్‌కాల్స్ సముద్రపు హోరులాగా వినిపిస్తూనే ఉన్నాయ్. రెండింటి మధ్యా కొంతసేపటి వరకూ ఉక్కిరిబిక్కిరై పోయేను.

అప్పటికి రాత్రి పదిగంటలైందేమో. కొంచెం సముద్రపు హోరు తగ్గింది. అప్పటికి మిగిలిందల్లా ఒక్క ప్రశ్నే. హైమవతి నన్ను చూడగానే రబ్బరు పాపనూ, గుల్‌బహార్‌నూ ముద్దుపెట్టుకోవడంలో ఆమె ఉద్దేశ్య మేవిటి?

హైమవతిలాంటి పువ్వులాంటి అమ్మాయిల్ని చూస్తే నాకు సున్నితమైన భావమే—అంటే సున్నితంగా ఆమె పల్చని బుగ్గలమీద ముద్దుపెట్టుకోవాలన్న కోరిక కలుగుతుంది.

ఖోస్లా కమిటీరిపోర్టు సినిమా రంగంలో ఎంత సంచలనం కలిగించిందో హైమవతి ముద్దుపెట్టుకోవటం నాలో అంతకన్నా సంచలనం కలిగించింది. హైమవతి నెలాగైనా ముద్దుపెట్టుకోవాలన్న భావం తీవ్రమైంది నాకు.

కీబోర్డునిండా హైమవతి రబ్బరు పాపను ముద్దుపెట్టుకుంటున్న దృశ్యమే కనిపిస్తోంది. ఎక్కడ చూసినా గుల్‌బహార్ ముద్దులే కని పిస్తున్నాయి. ఆ ముద్దులకు నా పెదవు లదురుతూంటూంటే— ఆ అదురుకి చిరునవ్వులు వణుకుతున్నయ్.

"ఏవండీ సెకండ్‌నైట్ ఓటీ చేస్తా రేమిటి?" అంటూ అంత వరకూ వెనక రీడింగ్ రూములో ఉన్న గణపతిరావు సెకండ్‌నైట్

డ్యూటీకి వచ్చి అడిగేవరకూ యాంత్రికంగా కాల్స్ బుక్ చేస్తూనే ఉన్నాను.

"ఆఁ అప్పుడే టైమయ్యిందిటండీ—! థేంక్యూ—" అంటూ టైముచూసేసరికి పన్నెండు: హెడ్‌గేర్‌సెట్ పీకి పడేసి లేచాను.

"పోనీ ఓటీచేస్తే చెయ్యకూడదూ— వేయించేస్తాను." అన్నాడు గణపతిరావు.

"సరి సరి అసలే ఆలోచనల్తో చచ్చిపోతూంటే ఓవర్ టైమ్ వర్కా-హటా? —వద్దుబాబూ—" అంటూ బయల్దేరాను.

"అయితే అమ్మాయిగారు మీ మనసును బాగా దోచేసుకున్నారే—" అన్నాడు గణపతిరావు కొంటెగా. మానేటరయినా ఆపరేటర్స్‌తో అంత కులాసాగా మాట్లాడ్తాడు గణపతిరావు. అతనికి దొరికిపోయానే అని నాలిక్కరుచుకున్నాను. అది చూసి పకపక నవ్వేడు గణపతిరావు.

ఆరోజునుండీ హైమవతి పల్చని తెల్లని ట్రాన్స్‌పరెంటు బుగ్గల మీద సున్నితంగా ముద్దుపెట్టుకోవాలన్న కోరిక మరింత గాఢమైపోయింది నాకు.

రెండు రోజుల తర్వాతగాని మరో విధంగా అవకాశం రాలేదు నాకు. అదైనా హైమవతి ఆలోచనల్లో పీకవరకూ మునిగి వుండబట్టి— ఆవేళ సెకండ్‌షిఫ్ట్ డ్యూటీ.

హైమవతి గురించి ఆలోచిస్తూంటే ఆ అమ్మాయి ఇల్లు జ్ఞాపకం వచ్చింది. అన్నట్టు— ఆ ఇల్లు సుబ్బరాజు అండ్ సన్స్‌ది. అయితే హైమవతి సుబ్బరాజుగారి అమ్మాయా? అయ్యుండాలి. సుబ్బరాజు గారింటికి ఫోనుందే.

ఫోనుందని గుర్తు రాగానే ఓ చిలిపి వూహ కలిగింది నాకు. ఫోన్‌లోనైనా కనీసం ఒక్కసారి హైమవతిని లవ్‌లీగా ముద్దుపెట్టు కుంటే— ఆ ఆలోచన రాగానే అప్రయత్నంగా కీ బోర్డుమీదికి చెయ్యి వెళ్ళింది కనక్షన్ ఇవ్వడానికి.

కాని ఒకవేళ నా ఖర్మకాలి సుబ్బరాజుగారే ఫోనెత్తితే? అమ్మో— ఫోన్‌తోనే మక్కె విరగ్గొటినంతపని చేస్తారు. పైగా ఉద్యోగానికి తిలోదకాలే.

నా మనస్సు హైమవతిని ముద్దుపెట్టుకోవడానికి వీల్లేకపోయిందే అని నలిగిపోయింది. కీ బోర్డుమీదా, హెడ్‌గేర్ సెట్‌మీదా ఒళ్ళు మండి, కోపం వచ్చింది.

ఎవరో ఇందాకట్నుంచీ హలోహలో అని అరుస్తున్నారు— "ఏవిటండీ'' అంటూ గట్టిగా విసుగ్గా అడిగాను.

"టూ జీరో సెవెన్—ఎక్స్‌టెన్షన్''

పాల పొంగుమీద నీళ్ళు చిలకరించినట్టు నా కోపం చల్లారి పోయింది. వెదకబోయిన తీగ కాలికి తగిలిందే అని పొంగిపోయాను.

టూ జీరో సెవెన్— ఎక్స్‌టెన్షనంటే సుబ్బరాజుగారింటికే— నాతో మాట్లాడింది సుబ్బరాజుగారే. షాపునుండి మాట్లాడుతున్నారన్న మాట. కనెక్షన్ ఇస్తూ హైమవతి మాట్లాడితే ఎంత బాగుండును— కనీసం ఈ విధంగా కలిసివచ్చిన అవకాశం వినియోగించుకొని హైమవతిని ముద్దుపెట్టుకోవచ్చును అనుకున్నాను సిల్లీగా. నాకు విని పించేటుగానే ఓపెన్ చేసాను.

లక్కీగా హైమవతే మాటాడింది.

"అమ్మ—హైమా—"

"ఆఁ నేనే నాన్నా—ఏం?" అని తీయగా అడిగింది హైమ గొంతు.

"ఏం లేదూ — అన్నయ్య వస్తాడుగానీ — అన్నయ్యతో డాక్టరుగారి దగ్గరకు వెళ్ళు తల్లీ— అల్లరి పెట్టకుండా"

"అలాగే నాన్నా—" అంది.

సంభాషణ అయిపోయి నట్టుంది. అంతమంచి అవకాశం కల్పించి నందుకు భగవంతుడికి మనసారా నమస్కారం పెట్టుకుందామను కున్నాను. కాని నమస్కారం పెట్టుక్కూచుంటే వచ్చిన అవకాశం చేజారిపోతుంది. అందుకే హెడ్‌గేర్‌సెట్ తాలూకు మౌత్ పీస్‌ని ముద్దుపెట్టుకున్నాను, అదే హైమవతి అనుకుంటూ.

వెంటనే నా పిచ్చితనానికి రవంత సిగ్గుపడ్డాను. సిగ్గుపడుతూ కమ్చీతో చెళ్లునకొట్టినట్టు ఉలిక్కిపడ్డాను. అన్నట్టు సుబ్బరాజుగా రేమ న్నారూ...అన్నయ్యను పంపిస్తాను...డాక్టరు దగ్గరకు వెళ్ళు తల్లీ అనా...ఏం... హైమవతికి... నా గుల్‌బహార్ కేవయ్యింది— అన్న ఆదుర్దా పట్టుకుంది.

చక్కగా లక్షణంగా ఫోన్‌లో మాట్లాడిందే—మరేం? జలుబో దగ్గో అయ్యుంటుంది? ఈ కాలం పిల్లలకి ప్రతి చిన్నదానికీ డాక్టర్ల దగ్గరకు పరిగెత్తడం అలవాటయిపోయింది అనుకున్నా నేనేదో పెద్దవాడిలా.

షిఫ్ట్ అయిపోగానే హైమవతిని చూడాలన్న ఆతృతతో ఉన్నాను. అనుకున్నప్పుడే ఏదో అవాంతరం వస్తుంది. అనుకోకుండా

ఓవర్ టైము వర్కు వేశారు. తప్పనిసరై ఉండిపోయాను. డ్యూటీ అయ్యే సరికి రాత్రి పన్నెండయ్యింది. ఆవేళ హైమవతిని చూడటం అయిందికాదు.

తరువాత రెండురోజు లిలాగే అయిందికాదు. మూడోరోజు హైమవతి ఇంట్లోకి చూడబోతే తాళం వేసిన తలుపులకు నా చూపులు గుద్దుకొని తిరిగి వచ్చేసాయి.

ఎక్కడికి వెళ్ళారో ఏమో... హైమవతిని చూసి అప్పుడే చాలా రోజు లయినట్టుగా ఉంది. కొంపదీసి హైమవతికి పెళ్ళి సంబంధం చూడ్డానికి వెళ్ళారా...

మనస్సదోలా అయిపోయింది. డ్యూటీ చాలా చప్పగా ఉంటోంది. నిరుత్సాహంగా ఎక్చేంజికి వెళుతున్నాను. పోనీ గణపతి రావైనా కలుస్తూంటే ఎదో సర్దాగా వుంటుంది. అతని గురించి బోగట్టాచేస్తే నాల్రో జుల్నించీ లీవ్‌లో ఉన్నట్లు తెలిసింది.

ఆ వేళ...

ఫస్టు షిఫ్టులో ఉన్నాను. డల్‌గా యాంత్రికంగా కాల్స్ బుక్ చేస్తున్నాను.

అంతలో నాతో కలిసి పనిచేసే ఆపరేటరు ఒకాయన వచ్చాడు.

"గణపతిరావు నొకసారి పరామర్శించి వద్దామా ?" అన్నాడు వస్తూనే.

గతుక్కుమని "ఏం, ఎవయ్యింది?" అని అడిగాను.

"మీకు తెలీదా... పాపం గణపతిరావు వుడ్‌బీవైఫ్... అంటే మేనమామ కూతురే— చనిపోయింది, రేపు కార్తీకంలో పెళ్ళి కావలసిందే—"

అయ్యో పాపం అన్పించింది. "ఎలా పోయిందిట ?" అడిగాను.

"ఏవీలేదు—రెండు రోజులు జ్వరం వచ్చిందట. రెండురోజులు కోమాలో ఉందిట— అప్పుడే వైజాగ్ తీసుకు వెళ్ళారు. అదేదో మెనింజైటిస్ అని ఆ జ్వరం పేరుట. అంతే ఆ అయిదో రోజున... అంటే నిన్నను కాబోలు పోయింది. పాపం ఆ అమ్మాయికీ గణపతి రావంటే ఎంతో ఇష్టంట—"

ప్చ్—ఏవిటో మంచివాళ్ళకే కష్టాలు. ఎంత సర్దాగా వుండేవాడు గణపతిరావు. అందుకోసమే కామోను నాలుగైదు రోజుల్నుండీ రావటం లేదు డ్యూటికి. అమ్మాయిని దక్కించుకోవడానికెంత సేవచేసేడో...

"పదండి—వెళ్ళొద్దాం—" అని డ్యూటీ మరొహతని కప్ప జెప్పి బయల్దేరాం—

చిన్న వీధిలో కాలు పెట్టగానే— పోసీ ఒకసారి హైమవతి వాళ్ళూ వూరినుంచి వచ్చేరోలేదో— వస్తే ఓసారి చూడొచ్చు నను కున్నాను. అంత విషాదంలోనూ చిన్నగా నవ్వుకున్నాను.

అన్నట్టూ గణపతిరావు ఇల్లు ఇటు కాదే—

"ఏవండీ— గణపతిరావు ఇల్లు ఇచే నేవిటి ?" అని అడిగాను.

"గణపతిరావు ఇల్లుకాదు. ఆయన మేనమామ గారిల్లు ఇదే—" అంటూ హైమవతి వాళ్ళ ఇంటిమెట్లు ఎక్కాడతను.

గుండె గుభిల్లుమంది.

ఏవిటీ హైమవతిగాని గణపతిరావు వుడ్‌బీవైఫ్— మేనమామ కూతురు కాదుగదా!— మరింకేం ఆలోచించలేకపోయాను. ఆలోచిద్దా

మన్నా అక్కడ వున్నజనం ఏడ్పులతో ఆలోచనల కంత రాయం కలిగింది.

తిన్నగా మా కొలీగ్ వెనకాలే చోటు చేసుకుని గుమ్మం ఎక్కి గదిలోని కడుగు పెట్టాను.

బెడ్ మీద వాడిపోయిన పువ్వులా పడివున్న హైమవతి లేత బుగ్గలమీద హృదయ విదారకంగా ఏడుస్తూ, ఎడతెరిపి లేకుండా ముద్దులు కురిపిస్తున్న గణపతిరావు కనిపించాడు.

అలాగే నీరై పోయాను నేను.

(జయశ్రీ)